క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామశివారులో ఉన్న శ్రీగిరి మూలిక క్షేత్రం దేవాలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బీజేపీ నేతలు ఏపీ మిథున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, జగదీష్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

సర్పంచ్ భానూరి మమత



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కక్కులూర్ గ్రామ సర్పంచ్ భానూరి మమత అన్నారు. గురువారం కక్కులూర్ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మమత మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు దేవుడిచ్చిన వరమన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్, మాజీ ఎంపీటీసీ జీవన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి

షాబాద్: తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండలం రేగడిదోస్వాడ నుంచి తిర్మలాపూర్ వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే తమ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిర్మలాపూర్ గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. రేగడిదోస్వాడ నుంచి తిర్మలాపూర్ వరకు బీటీ పనులకు నిధులు మంజూరు చేసినందుకు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గౌరబిభార్ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: రైలుకింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం బర్డెన్‌బార్గార్, బరడపలి గ్రామానికి చెందిన గౌరబిభార్(50) గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌరబిభార్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకోవద్దని చెపుతున్నా వినకుండా గౌరబిభార్ బలవన్మరణానికి పాల్పడ్డాడని కొందరు స్థానికులు చెపుతున్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ స్టేషన్‌మాస్టర్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతను ఒడిశా రాష్ట్రం బరడపలి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి బంధువులు ఎవరు రాకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ లభించినా, మృతదేహాన్ని గుర్తించిన 8247097836, 9848090426 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య తెలిపారు.

ఆరంభంలోనే భగభగలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- బయటకు వెళ్లలేని పరిస్థితి



షాబాద్‌లో నిర్మానుష్యంగా రోడ్లు

షాబాద్: వేసవి కాలం ఆరంభంలోనే భానుడు ప్రజలపై తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలోనే ఎండ తీవ్రత ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నిత్యం రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలు, వ్యాపార సముదాయాలు ఎండల తాకిడికి గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. ఉదయం 11గంటలు దాటిందంటే రోడ్లపైకి జనం రావడానికి భయపడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సివస్తే ఉదయం, సాయంత్రం వేళల్లోనే వెళ్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు , వాహనదారులు తిరగకపోవడంతో రోడ్లన్నీ బోసిపోతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఎండల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి తాపం నుంచి కాపాడుకోవడానికి ఎక్కువగా కొబ్బరిబొండాలు, నిమ్మకాయ పానియాలు, లస్సీలు, పండ్ల రసాలు తాగి సేద తీర్చుకుంటున్నారు.

బయటకు వెళ్లలేక పోతున్నాం...



ఎండ తీవ్రంగా ఉంది. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఎండలో వెళ్లితే వడదెబ్బకు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నాం. మార్చి నెలలోనే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఏ విధంగా ఉంటాయో తలుచుకుంటేనే భయమేస్తోంది.

–వడ్ల భాస్కర్, తాళ్లపల్లి

తాగునీటి సమస్యను అధిగమించాలి

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: గ్రామాల్లో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి మండల కార్యదర్శులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండలు ముదురుతున్నా నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో హరిత హారం కార్యక్రమాల్లో నాటిన మొక్కలకు ప్రత్యేక నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. నర్సరీల బాధ్యత కార్యదర్శులదేనని చెప్పారు. 100శాతం ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేయాలని తెలిపారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. ఎండలు పెరుగుతున్నందున ఉపాధి హామీ కూలీలకు తగు జాగ్రత్తలను సూచించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, కార్యదర్శులు, హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

50శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

బీఎస్పీ నాయకుడు రాములు



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

కొందుర్గు: దేశ జనాభాలో 50 శాతం కన్నా ఎక్కువ ఉన్న బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి తట్టెపల్లి రాములు డిమాండ్ చేశారు. గురువారం కొందుర్గు మండలం బైరంపల్లి గ్రామంలో బీఎస్పీ నాయకులు పర్యటించి బీసీల రిజర్వేషన్ పెంచాలని కోరుతూ.. సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల బతుకులు మారడం లేదని, బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల బతుకులు మారుతాయన్నారు. ఒక్కసారి బీఎస్పీకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో షాద్‌నగర్ అసెంబ్లీ బీఎస్పీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు శ్రీనివాసు, దర్శన్, శ్రీనివాసు, నర్సింలు, శ్రీకాంత్, ప్రవీణ్, యాదయ్య, రవి, సిద్దు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



వినతి పత్రం అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

షాద్‌నగర్: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. దేశభక్తితో కూడిన యువతను నిర్మించడంలో శిశుమందిరాలు కీలక పాత్ర పోషిస్తుండడం హర్షనీయమన్నారు. హిందూత్వానికి కట్టుబడి ఉన్న ఈ విద్యాసంస్థలు శారీరక, మానసిక ఆధ్యాత్మికతతో కూడిన సేవా భావాన్ని విద్యార్థులు పెంపొందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై యాజమాన్యం వారు ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, పసుల నర్సింహ్మ యాదవ్, ఆకుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

16న రాజ్యాంగం- మనుస్మృతిపై సెమినార్

షాద్‌నగర్ రూరల్: రాజ్యాంగం- మనుస్మృతి అనే అంశంపై నిర్వహించనున్న జిల్లా స్థాయి సెమినార్‌ను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని కేకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 16న చర్చ ఉంటుందని తెలిపారు. మనువాద రాజ్యాంగం ఏర్పాటుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. లౌకికవాదులు, ప్రజాస్వామికవాదులు దీన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెమినార్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, బుద్దుల జంగయ్య, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మేకగూడలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నందిగామ: మండల పరిధిలోని మేకగూడ గ్రామానికి ఆనుకొని నాట్కో చౌరస్తా వద్ద రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఒక వైపు మండల కేంద్రమైన నందిగామ నుంచి మేకగూడకు వెళ్లే రహదారి, మరో వైపు నాట్కో పరిశ్రమ నుంచి సర్వేంద్రిగూడకు వెళ్లే రహదారి ఈ రెండు రోడ్లు కలిసే చౌరస్తా వద్ద బస్‌స్టాపు ఉంది. ఈ బస్‌స్టాప్‌నకు ఆనుకొని రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ట్రాన్స్ ఫార్మర్‌ను ఇక్కడినుంచి తొలగించాలని గత కొంత కాలంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



జెడ్పీటీసీ స్వరూపను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ఆయా గ్రామాల మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల మహిళా ప్రజాప్రతినిధులను, మహిళా అధికారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, వ్యాస రచన, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బంగారు స్వరూప, ఎంపీపీ సన్వల్లి యాదమ్మ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ బిజయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఎంపీడీఓ మహేష్‌బాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏపీఎం రామస్వామి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శంకర్‌పల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గోపులారం సర్పంచ్ పాడువు శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోపులారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం మహిళా వార్డు సభ్యులను, టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందిని, ఆశ వర్కర్లను, మహిళా సంఘాల మహిళలను, ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని వివరించారు. సీఎం కేసీఆర్ మహిళల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



ఆర్థిక సహాయం అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన సిరిగిరి జంగమ్మ బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. ఆమె భర్త అంజయ్య కూడా గత ఐదు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి ముగ్గురు పిల్లలు ప్రశాంత్, శివ, లక్ష్మి అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి గురువారం ముగ్గురు పిల్లలను పరామర్శించి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఉండేందుకు ఇల్లు కూడా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు గ్రామస్తులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తక్షణ సాయం రూ.10వేలు అందజేశారు. త్వరలో మరో రూ.2లక్షలు ముగ్గురు పిల్లల పేర్లపై బ్యాంకులో డిపాజిట్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి కూడా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ యాదమ్మ, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, పద్మారావు, బాలకృష్ణ, రాందేవ్‌యాదవ్ తదితరులున్నారు.

టీచర్ల సమస్యలపై ఏవీఎన్‌రెడ్డి నిరంతర కృషి

బీజేపీ నాయకులు తులసిరామ్, విజయ్‌కుమార్



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

షాబాద్: టీచర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు ఏవీఎన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని చేవెళ్ల నియోజకవర్గం బీజేపీ నాయకులు వర్రీ తులసి రామ్, విజయ్‌కుమార్ అన్నారు. గురువారం షాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము ఆధ్వర్యంలో ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం నిరంతరం పోరాటం చేసే టీచర్ల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చలేదన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపిస్తే చట్టసభలలో టీచర్ల సమస్యలపై పోరాటం చేస్తారని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

పుస్తె మెట్టెలు అందజేత



నందిగామ : యాదయ్య దంపతులకు పుస్తె మెట్టెలను అందజేస్తున్న సర్పంచ్ రజనీత

నందిగామ: గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ నిరుపేద కుటుంబానికి వెంకమ్మగూడ సర్పంచ్ రజనీతగౌడ్ అండగా నిలిచారు. గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న యాదయ్య కుమార్తె వివాహం గురువారం జరుగుతుండడంతో గ్రామ సర్పంచ్ రజనీత యాదయ్య ఇంటికి చేరుకొని పుస్తెమెట్టెలతో పాటు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా రజనీత మాట్లాడుతూ.. నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, తమకు తోచిన సహాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.



షాద్‌నగర్: పుస్తె, మెట్టెలను అందజేస్తున్న సర్పంచ్ పద్మనరేందర్‌రెడ్డి దంపతులు

కళ్యాణానికి పుస్తె, మెట్టెల అందజేత

షాద్‌నగర్: మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల యువతీ, యువకుడి వివాహాలకు గురువారం సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డిలు పుస్తె, మెట్టెలు అందజేశారు. గ్రామానికి చెందిన మంజుల వివాహానికి, మరో యువకుడు సాయిలు వివాహానికి ఒక్కొక్కరికి రూ.15వేల విలువ చేసే పుస్తె, మెట్టెలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పేదల వివాహాలకు ఆర్థిక సహాయం కూడా చేస్తున్నట్లు చెప్పారు.

చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ ఏఈ కార్తీక్



తూంను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ కార్తీక్ తదితరులు

నందిగామ: చెరువులు, కుంటలను కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ కార్తీక్ అన్నారు. మండల పరిధిలోని చేగూరు గ్రామ శివారులోని మోడేంకుంట, ఒరంబాయి కుంట, కర్దం కుంటలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈ కార్తీక్ మాట్లాడుతూ.. ఇటీవల గ్రామానికి చెందిన మంకాల శ్రీశైలం కుంటలు, చెరువుల పరిస్థితిపై తమకు వినతి పత్రం అందించడంతో పరిశీలన కోసం వచ్చినట్లు చెప్పారు. గ్రామ శివారులోని పలు కుంట కట్టలపై ముళ్ల చెట్లు మొలిచాయని, తూములు చాలా వరకు శిథిలావస్థకు చేరాయని , కొన్ని చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయని ఆయన తెలిపారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా చెరువులను, కుంటలను కబ్జా చేసినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులను సందర్శించిన వారిలో గ్రామస్తులు మంకాల శ్రీశైలం, బాల్‌రాజ్, చంద్రయ్య, భీమయ్య, ఆంజనేయులు, కృష్ణ, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

నిద్రలోనే కన్నుమూత

చేవెళ్ల: కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశాడు. అంతా కలసి నిద్రపోయారు. ఉదయం విగతజీవిగా కనిపించాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కందవాడకు చెందిన కారుకొండ శేఖర్(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగా బుధవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. గురువారం ఉదయం భార్య బాలమణి భర్త శేఖర్‌ను నిద్ర లేపేందుకు వెళ్లింది. ఎంత పిలిచినా లేవకపోవడంతో భయంతో చుట్టుపక్కల వారిని పిలిచింది. అప్పటికే అతను మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిద్రలో గుండెపోటు వచ్చి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు.

విద్యార్థుల అభివృద్ధి కోసమే ఎన్నోవేషన్

- టీహబ్ రిటైర్డ్ వింగ్ కమాండర్ అనీష్ అంథోని
- జేబీ ఇనిస్టిట్యూట్‌లో తెలంగాణ హబ్‌తో ఒప్పందం
- జేబీ గ్రూప్ భాస్కర మెడికల్ కళాశాలలో కిక్‌స్టార్ట్ కార్యక్రమం ప్రారంభం



అనీష్ అంథోనిని సన్మానిస్తున్న జేబీ కృష్ణారావు, దీపిక తదితరులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా దేశంలో ఎన్నోవేషన్ కొనసాగుతుందని, టీహబ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి ఎంతో అవసరమని టీహబ్ రిటైర్డ్ వింగ్ కమాండర్ అనీష్ అంథోని, జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి జేబీ కృష్ణారావులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల జేబీ గ్రూప్ విద్యా సంస్థల్లో తెలంగాణ హబ్ ఒప్పంద సంతకం కార్యక్రమాన్ని జేబీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ భాస్కర్ మెడికల్ కళాశాలలో కిక్ స్టార్ట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జె.బి.కృష్ణారావు, అనీష్ అంథోని, డాక్టర్ బి.దీపిక, భాస్కర్ మెడికల్ కళాశాల సభ్యులు సొసైటీ డైరెక్టర్ సీఈఓ ఎస్.ఎస్.దసక పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫ్యాకల్టీ విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం అనీష్ అంథోని మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో పాలుపంచుకోవాలని గుర్తు చేశారు. అనంతరం జేబీ కృష్ణారావు మాట్లాడుతూ.. అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీ విద్యా సంస్థలను కీర్తిశేషులు జే.బి.భాస్కర్‌రావు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ జేబీ విద్యా సంస్థలు ఒక హబ్‌గా ఏర్పడిందని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణ టీ-హబ్‌తో గురువారం ఒప్పందం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జేబీ గ్రూప్ విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్‌తో పాటు మెడికల్ ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా కళాశాలలు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి నాణ్యమైన విద్యను అందించేందుకు టీహబ్‌తో ఒప్పందం చేసుకొని బోధన విధానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీపిక, సీఈఓ ఎస్.ఎస్ దసక, ప్రిన్సిపాల్స్, డీన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.